# ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు

**బాలాపూర్ తాసీల్దార్ ఇందిరాదేవి**

**మామిడిపల్లి సర్వే నంబర్ 241/1**

**గుంటల భూమిలో చుట్టూ ఫెన్సింగ్**



మామిడిపల్లిలో సర్వే నంబర్ 241/1 ఉన్న ప్రభుత్వ భూమికి చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తున్న రెవెన్యూ అధికారులు

బడంగ్‌పేట్, మార్చి 22: ప్రభుత్వ భూములను ఎవరూ కబ్జా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాలాపూర్ తాసీల్దార్ ఇందిరాదేవి తెలిపారు. బాలాపూర్ మండల పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న సర్వే నంబర్ 241/1లో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయించినట్లు పేర్కొన్నారు. ఫెన్సింగ్ వేయకుండా కొంతమంది కాంగ్రెస్ నేతలు రైతులతో వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అధికారులకు, స్థానికులకు మధ్య వాగ్వివాదం జరిగింది. తాము కొన్నేండ్ల నుంచి ఈ భూమిని సాగు చేసుకున్నట్లు స్థానికులు రెవెన్యూ అధికారులతో చెప్పారు. ఎట్టి పరిస్థితులలో ఫెన్సింగ్ వేయనీయమని అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు పోలీస్ బందోబస్తుతో వచ్చి ఫెన్సింగ్ వేయించారు. నిజమైన రైతులు ఉంటే డబ్బులు ఇవ్వడానికి తాను సహకరిస్తానని మామిడిపల్లి రైతులతో తాసీల్దార్ చెప్పారు. మీ భూమి అయితే ఇంతకాలం ఎందుకు తీసుకోలేదని ఆమె వారిని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని కాపాడే ప్రయత్నం చేస్తుంటే అడ్డ తగలడం మంచి పద్ధతికాదన్నారు. ఓసారి పరిశీలించి నిజమైన పేద ప్రజలు ఉంటే ప్రభుత్వపరంగా న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తానన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఎవరు కబ్జా చేసినా కూడా కేసులు నమోదు చేయిస్తామన్నారు. ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేయిస్తామన్నారు.మామిడిపల్లి రైతులు మాత్రం మాకు ఎలాగైనా న్యాయం చేయాలని తాసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

## డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం

**మంత్రి సీతక్క**



సైదాబాద్‌లో డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, అధికారులు తదితరులు

సైదాబాద్, మార్చి 22:యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడుకోవడానికి మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపి నిర్మూలిస్తుందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సైదాబాద్ జైలు గార్డెన్ ఆవరణలోని తెలంగాణ జువైనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంపై అంతస్తులో తెలంగాణ డిపార్ట్మెంట్ ఫర్ ఉమెన్ చిల్డ్రన్ డిజేబుల్ అండ్ సీనియర్ సిటిజన్స్ విభాగం ఆధ్వర్యంలో 'మిషన్ పరివర్తన' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాల బాలలకు తెలంగాణ డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్‌ను శనివారం ఆమె ముఖ్యఅతిథి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మత్తుకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో మొదటి సరిగా జువైనల్ అబ్జర్వేషన్ చిన్నారుల కోసం రూ.15లక్షల వ్యయంతో డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ ప్రారంభించామని, ఇలాంటి అవకాశాలు భవిష్యత్తులో రాకుండా యువత చూసుకోవాలని, పైలెట్ ప్రాజెక్టుగా ఇక్కడ ప్రారంభించడం జరిగిందని ఆమె తెలిపారు. మత్తుకు బానిసైన వారిని గుర్తించి వారిలో మార్పు తీసుకుని రావడం కోసం ప్రతిఒక్కరిని ఒక కేస్ స్టడీగా తీసుకొని వారి జీవితాల్లో మార్పు తెస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ క్రాంతి వెస్లి, తెలంగాణ డిపార్ట్మెంట్ ఫర్ ఉమెన్, చైల్డ్ డిజేబుల్ అండ్ సీనియర్ సిటిజన్స్ డైరెక్టర్ శైలజ, జువైనల్ హోం డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ చార్వాక, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణా రవీందర్ రెడ్డి, పర్యవేక్షణ అధికారులు నవీన్‌కుమార్, అఫ్జల్, జ్వాల తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలకు భవనాలు నిర్మించాలి**

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు శనివారం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. శంకేశ్వర్ బజార్ బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రం అద్దెభవనంలో నడుస్తుందని, ప్రభుత్వ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని కోరారు. బస్తీలోని పిల్లలకు అందుబాటులో ఉండే విధంగా భవనం నిర్మించాలని మంత్రికి వినతిపత్రం అందజేయగా.. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు.

## వీహెచ్‌పీ నేత ఇంటిపై దాడి

వనస్థలిపురం, మార్చి 22: విశ్వహిందూ పరిషత్ నాయకుడు రావినూతల శశిధర్ ఇంటిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని అగంతకులు దాడి చేశారు. కాగా, గతంలోనే కొంత మంది వ్యక్తులు అనుమానాస్పదంగా ఆయన ఇంటి పరిసరాల్లో తిరగడం ఆయన గుర్తించారు.

తనపై రెక్కీ చేస్తున్నారన్న అనుమానంతో గత వారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, శుక్రవారం అర్ధ రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. మొదటి అంతస్తులోకి రావడంతో గమనించిన శశిధర్ కుటుంబ సభ్యులు అరవడంతో పారిపోయాడు. దీంతో మరోసారి ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల్లో అగంతకుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. రాత్రి తెల్లవారేదాకా పోలీసులు దుండగుల గురించి గాలించినట్లు పోలీసులు తెలిపారు. తనకు ప్రాణహానీ ఉందని, పోలీసులు తనకు భద్రత కల్పించాలని శశిధర్ కోరారు.

## గ్రూప్-1లో అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు

ఎల్బీనగర్, మార్చి 22: గ్రూప్–1లో అక్రమాలపై పోలీసులకు అశోక్ అకాడమీ డైరెక్టర్, నిరుద్యోగుల హక్కుల వేదిక చైర్మన్ల అశోక్ చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టీజీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షల మెయిన్ కీ విడుదల చేయలేదని, అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఎల్ఆర్ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకోండి

**కమిషనర్ సరస్వతి**

బడంగ్‌పేట్, మార్చి 22: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ స్కీమును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతి అన్నారు. 30,500 మందికి ఎల్ఆర్ఎస్ ఫ్రీ ఆప్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. 1700 మంది ఎల్ఆర్ఎస్ కట్టడం జరిగిందన్నారు. రూ.11.50 కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు. ఎఫ్టీఎల్, ప్రభుత్వ భూమి, ఎండోమెంట్, కోర్టు కేసులలో ఉన్న వాటికి ఎల్ఆర్ఎస్ వర్తించదన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీం మార్చి 31వ తేదీ వరకే చివరి తేదీ అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సరస్వతి అన్నారు.

**సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి**

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సరస్వతి అన్నారు.మార్చి 30, 31వ తేదీల్లో రెండు రోజులు ఉగాది, రంజాన్ ఉన్నాయన్నారు. రెండు సెలవు దినాలు వస్తున్నాయి.. కనుక 27వ తేదీ లోపు ఇంటి పన్నులు చెల్లించాలని ఆమె కోరారు. రూ.39.52 కోట్లు ఉందన్నారు. ప్రస్తుతం 17 కోట్ల వరకు పన్నులు వసూల్ చేశామన్నారు. బకాయిలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. పనులు చెల్లించని వారి డ్రైనేజీ లైన్లను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

## కుమ్మరులు అన్ని రంగాల్లో ఎదగాలి

ఖైరతాబాద్, మార్చి 22:కుమ్మరులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ జె. పూర్ణచందర్ రావు పిలుపునిచ్చారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కుమ్మర శాలివాహన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీసమాజ్ అధ్యక్షులు, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రవిశంకర్, కె.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు సంగెం సూర్యారావు, కోశాధికారి నిమ్మలూరు శ్రీనివాస్ రావు, గౌరవ అధ్యక్షులు కె. దశరథరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్ణచందర్ రావు మాట్లాడుతూ శాలివాహనచక్రవర్తి స్ఫూర్తితో కుమ్మరులు రాజకీయంగా ఎదిగినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. త్వరలో లక్ష మంది కుమ్మరులతో బహిరంగ సభను నిర్వహి స్తాన్నారు. నగేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, ఆకారపు మల్లేశం, రేపాక రాం బాబూ, కంభంపాటి సత్య నారాయణ, సిలివేరు వెంకటేశ్, శంకర్, మల్లికార్జున్, నర్సింహ పాల్గొన్నారు.

## ఇఫ్తార్‌లు స్నేహానికి ప్రతీకలు



సామూహిక విందులు స్నేహానికి ప్రతీకలుగా నిలుస్తాయని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి తెలిపారు. శనివారం జల్లపల్లిలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందులో సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో అల్లాకు ప్రతిరూపంగా మన తోటివారిని గుర్తిస్తూ వారి ఆకలి తీరుస్తూ ఇతోదికంగా సహకారం అందించాలని సూచించారు. అప్పుడే దైవానికి మన మధ్య బంధం మరింత బలపడుతుందన్నారు. మంచి మార్గంలో పయనించడానికి ఇఫ్తార్ విందులు తోడ్పాటు అందిస్తాయిన్నారు.

– చార్మినార్/పహాడి షరీఫ్, మార్చి 22

## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి



హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ, నాయకులు

కందుకూరు,మార్చి 22: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ గంగుల సమంత ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి కృషితో రూ.8లక్షలతో నాలుగు లైట్లు మంజూరయ్యాయి. శనివారం లైట్ల ఏర్పాటుకు విద్యుత్ స్తంభాలను బిగించడానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అజ్బల్ బేగ్, నాయకులు రూప్‌చందర్, గంగుల సంజీవరెడ్డి, డైరెక్టర్ పుష్ప దర్శన్, పాఠశాల చైర్మన్ శివలీల, పర్వీ జ్, వరికుప్పల బాబు, అజారుద్దీన్, శ్రీహరి, ఫయాజ్ బేగ్, శేఖర్, అంజలి,లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా: ఉప్పల శ్రీనివాస్ గుప్తా

మన్సూరాబాద్, మార్చి 22: నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధి జైపురి కాలనీలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయ 17వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తాను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. జై పురి కాలనీలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఉప్పల శ్రీనివాస్ గుప్త ప్రారంభించారు. కార్యక్రమంలో సాయి కిరణ్, శ్రావణి, ఆలయ కమిటీ చైర్మన్ కొలను వెంకట్ రెడ్డి, కార్యదర్శి కొరవి జంగయ్య గుప్తా, కోశాధికారి రావుల రంజిత్ గౌడ్, వైస్ చైర్మన్ వెంకటరమణ గౌడ్, బద్దం మోహన్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్పీ మృతదేహానికి పోలీసు అధికారుల నివాళి



బాబ్జి పార్థివ దేహం వద్ద పూలమాల వేసి గౌరవ వందనం చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

హయత్‌నగర్, మార్చి 22: వాకింగ్‌కు వెళ్తుండగా..ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన అడిషనల్ ఎస్పీ టీ.ఎం.నందీశ్వర బాబ్జి(50) మృతదేహానికి పోలీసు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీస్‌కమిషనర్ సుధీర్‌బాబు, షీటీం డీసీపీ ఉషారాణి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, సీఐలు నాగరాజు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గట్టుమల్లు, పోలీస్ సిబ్బంది నందీశ్వర బాబ్జి మృతదేహానికి ఆయన నివాసంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హయత్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.


## సింగరేణి కాలనీ సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సేఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు

సైదాబాద్, మార్చి 22:సింగరేణి కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను కేటాయించాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని శనివారం సేఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణికాలనీలో ఎన్నో ఏండ్లుగా పేరుకుపోయిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరామని తెలిపారు. స్థానికంగా ఉన్నత పాఠశాల, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ఆధార్ కార్డులు,జనన ధృవీకరణ పత్రాల క్యాంపు నిర్వహించాలన్నారు. అదే విధంగా అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బెల్టు షాపులు, మత్తు పదార్థాలను అరికట్టడానికి, పోలీసు ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. అనేక ఏండ్లుగా నివాసం ఉంటున్న గుడిసెవాసులకు పొజిషన్ పట్టాలు ఇచ్చి, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.యువతకు స్వయం ఉపాధి, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించుకోగా, త్వరలోనే సింగరేణి కాలనీ సందర్శించి సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని సేఫ్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, జటావత్ శ్రీను నాయక్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ తెలిపారు.

## న్యాయవాదులు శుభాకాంక్షలు




హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ తెలంగాణ హైకోర్ట్ ఏజీపీగా న్యాయవాది విజయకుమారి, తెలంగాణ హైకోర్ట్ స్టాండింగ్ కౌన్సిల్ మార్క్ఫెడ్ కు పోలె విష్ణు నూతనంగా నియమింపబడ్డ సందర్భంగా సీనియర్ న్యాయవాది జిల్లా రమణారావు ఆధ్వర్యంలో న్యాయవాదులు డేవిడ్ రాజు, పీవీఆర్ ప్రసాద్, జీవన్, సుందర్ రావు, ఏవీ రమణ, చక్రవర్తి, శ్రీహరి, విఘ్నేశ్వర్, బి.లక్ష్మయ్య, అనిల్, బుచ్చిబాబు, కోటేశ్వర్ రావు, కొమరయ్య, చంద్రశేఖర్, వీరన్న, సురేశ్, ఎన్.భాగ్య తదితరులు వారిని శాలువాతో సన్మానించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– ఆర్కేపురం, మార్చి 22



రాలిన మామిడికాయలు



కూలిన రేకుల షెడ్డు

## అకాల వర్షం

కందుకూరు, మార్చి 22: మండలంలో శనివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతోపాటు ఈదురు గాలులు రావడంతో రేకుల షెడ్లు, పురాతన ఇండ్లు కూలిపోయాయి. గాలులకు మామిడికాయలు రాలిపోయాయి.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



విద్యాధికారి నరసింహకు వినతిపత్రం అందజేస్తున్న బాల్‌రాజ్ కార్మికులు

కందుకూరు, మార్చి 22:మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనట్లు సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విద్యాధికారి నరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10వేలు చెల్లిస్తానని చెప్పి మాట తప్పినట్లు పేర్కొన్నారు. 15 నెలలు దాటినా అమలుకు నోచుకోకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు జతలు డ్రెస్సులు, గ్యాస్ వసతి కల్పించాలని కోరారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 24వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్‌కర్, శ్రీనివాస్, గీతా, లక్ష్మమ్మ, మంజుల, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు సంత వేలం




వేలంపాటలో పాల్గొన్న అధికారులు

కందుకూరు, మార్చి 22:కందుకూరు సంతను 2025–26 సంవత్సరానికి గాను వేలం నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఎండీఓ బానోతు సరిత సమక్షంలో గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఈ వేలంపాటలో అనేక మంది పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన ఈ వేలంపాటలో అదే గ్రామానికి చెందిన కుమ్మగాళ్ల యాదగిరి రూ. 5,59,010 లక్షలకు కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, పీఏసీఎస్ డైరెక్టర్ సూరసాని శేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్ గౌడ్, కారోబర్ సిద్ధేశ్వర రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**మేకల సంతకు స్థలం చూపాలి**

మండల కేంద్రంలో నిర్వహించే మేకల సంతకు ప్రభుత్వ స్థలం చూపాలని మార్కెట్ డైరెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఎండీఓ సరితను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మేకల సంతకు ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ప్రైవేట్ స్థలంలో నిర్వహించాల్సి వస్తుందని, అందువల్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ స్థలాన్ని చూపించి మేకల సంత కొనసాగించడానికి కృషి చేయాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




బాచుపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీటీసీ, డాక్టర్లు

కందుకూరు, మార్చి 22: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జైత్వారం గ్రామం మాజీ ఎంపీటీసీ గుండాల సురేశ్, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ కోరారు. మండల పరిధిలోని గూడూరు గేట్ వద్ద గల లిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బాలరాజు, డాక్టర్ శంకర్‌రెడ్డిలతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి దాదాపు 350 మంది ప్రజలు వచ్చి వివిధ రకాల వ్యాధులను పరీక్షించుకున్నారు. అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ బాలరాజు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడానికి తమ ఆసుపత్రి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. పేదలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందక రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసి తోటి వారికి సహాయ పడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ నాయకులు ఎగిరిశెట్టి నరేశ్, కృష్ణ, విజయ్, యుగేందర్‌రెడ్డి, రాజు, ప్రభాకర్, డాక్టర్లు వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి



నరసింహ(ఫైల్)

హయత్ నగర్, మార్చి 22: భవనం పైనుంచి పడి ఓ సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం...మీర్‌పేట్, నందనవనం కాలనీలో నడ్డి నరసింహ(54), భార్య గాలమ్మ దంపతులకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. నరసింహ వృత్తిరీత్యా భవన సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తుంటాడు. శనివారం నరసింహ హయత్‌నగర్‌లోని ఇన్ఫర్మేషన్ కాలనీలోని బహుళ అంతస్తుకు సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు 4వ అంతస్తు నుంచి కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



హయత్ నగర్, మార్చి 22: గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. హయత్ నగర్‌లోని వినాయకనగర్ కాలనీ, శ్రీకృష్ణ స్టీల్ ట్రేడర్స్ షాప్ ముందు ఓ గుర్తుతెలియని వ్యక్తి వయసు సుమారు 50 నుంచి 55 ఏండ్లు కలిగి తెలుపు రంగు బనియన్, థిక్ బ్లూ కలర్ నిక్కర్ ధరించి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ చేరుకొని అతడిని పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మద్యం తాగడంతో పిట్స్ వచ్చి చనిపోయినట్లుగా తెలుస్తున్నది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. బంధువులు ఎవరైనా ఉంటే హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## వివాహిత అదృశ్యం



గుటీ దేవి(ఫైల్)

మన్సూరాబాద్, మార్చి 22: నాగోల్ పీఎస్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్, కాన్పూర్‌నగర్, బిచ్చిపూర్‌కు చెందిన చరణ్‌సింగ్ ప్రస్తుతం నాగోల్, మమతానగర్ కాలనీలోని సరస్వతి మార్బుల్‌షాప్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సరస్వతి మార్బుల్‌షాప్‌లోనే తన భార్య గుటిదేవి(35)తో కలిసి నివాసం ఉంటున్నాడు. ఫత్తులగూడాలోని గీతాంజలి హ్యాండ్లూమ్స్‌లో ఆమె రెండేండ్ల కిందట వరకు పనిచేసి మానేసింది. ఆ షాపులో డబ్బులు వచ్చేది ఉందని చెప్పి ఈనెల 21న ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. గుటి దేవి ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వస్తున్నది. ఆ షాపు యజమానికి చరణ్‌సింగ్‌కు ఫోన్ చేయగా.. అక్కడికి రాలేదు అని తెలిపారు. దీంతో ఆమె ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలతోపాటు బంధువులు, మిత్రుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. చరణ్‌సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.